26న వికాస కార్యాలయంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

వికాస కార్యాలయంలో ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేటు లిమిటెడ్, అల్ఫాబెట్ ఎడ్యుకేషనల్ హబ్, ఐసిఐసిఐ బ్యాంక్, డెక్కన్ కెమికల్స్, ఆటోమోటివ్ ఇండియా లిమిటెడ్, డిక్సాన్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. డిడియుజికెవై స్కిల్ డెవలప్ మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు 26న కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్ద హాజరుకావలన్నారు. వివరాలకు 77993763333, www.vikasajobs.comలో సంప్రదించాలన్నారు.

ఊపందుకోని నిర్మాణాలు

- తగ్గిన సిమెంటు, ఇనుము ధరలు
- పెరుగుతున్న సామగ్రి ధరలు
- కార్మికులకు తగ్గుతున్న ఉపాధి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ రంగం బాగా కుదేలయ్యింది. ఇసుక పాలసీ పేరుతో కార్మికుల ఉపాధిని దెబ్బ తీసింది. ఇసుక పంపిణీ భాధ్యతను ప్రయివేటు సంస్థలకు అప్పగించడంతో డిమాండుకి తగ్గ ఇసుక సరఫరా చేయకుండా బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తూ ఇళ్ల నిర్మాణం అత్యంత ఖరీదుగా మార్చేశారు. దీంతో వేలాదిమంది కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. అడపా దడపా పనులు ఉంటున్నా కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవడం లేదని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం సిమెంటు, ఐరన్ ధరలు తగ్గుముఖం పట్టాయి. సిమెంట్ రూ.290 నుంచి 330 వరకూ ఆయా కంపెనీలను బట్టి ఉండేవి. ప్రస్తుతం రూ.20 వరకూ తగ్గింది. గతేడాది రూ.350 నుంచి 370 వరకూ అమ్మేవారు. ఐరన్ ధరలు గతేడాది రూ.65 వేల నుంచి రూ.68 వేల వరకూ అమ్మేవారు. ఈ ఏడాది సంక్రాంతికి ముందు రూ.63 నుంచి 64 వేలు ఉండేది. ప్రస్తుతం రూ.58 నుంచి రూ.60 వేలకు తగ్గింది.

నిర్మాణదారులు వెనుకడుగు

నిర్మాణాలకు డిసెంబర్ నుంచి మే నెల వరకూ అనుకూలమైన కాలం. ఈ నేపథ్యంలో సిమెంటు ఐరన్ ధరలు పెరుగుదల అనివార్యంగా ఉంటుంది. కానీ ఈసారి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఈ ధరలు తగ్గుముఖం పట్టినా నిర్మాణాలు ఊపందుకోలేదు. నిత్యావసరాల ధరలు పెరుగుదల వలన ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం దానికి తోడు ఆదాయం కూడా బాగా తగ్గడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. మార్కెట్లో నిత్యవసర సరుకుల ధరలు రెండు రెట్లు పెరిగాయి. కాయగూరల ధరల సైతం దిగి రానంటున్నాయి. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల భారం సామాన్యులను వేధిస్తోంది. ఛార్జీల మోత, విద్యుత్తు బిల్లుల పెంపు వంటి కారణాల వల్ల కుటుంబ పోషణ కూడా కష్టమవుతుంది. మరోవైపు భవన నిర్మాణానికి ఉపయోగించే ఇతర సామాగ్రి ధరలు దిగి రాలేదు. నాలుగేళ్ల క్రితం రెండు సెంట్లలో ఇంటికి ఎటువంటి హంగులూ లేకుండా రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షలు ఖర్చు అయ్యేది. కొంతకాలంగా ధరల పెరుగుదలతో రూ.12 లక్షల నుంచి రూ.14 లక్షలు వ్యయం చేస్తేనే గాని ఇల్లు పూర్తికాని పరిస్థితి ఏర్పడింది. అప్పట్లో ఇటుక ధర రూ.5 వేలు ఉండేది. ఇప్పుడు రకాలను బట్టి రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకూ పెరిగింది.

ప్లంబ్లింగ్, వైరింగ్, మెటీరియల్, స్విచ్ బోర్డులు, విద్యుత్ వైర్లు, అల్యూమినియం కిటికీలు, తలుపులు, టైల్స్, పెయింట్స్ ఇలా అన్ని ధరలు రెండు రెట్లు పెరగడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. 20 టన్నుల ఇసుక రూ.10 వేలు ఉండేది. ప్రస్తుతం సుమారు రూ.22 వేలకు పెరిగింది.

కార్మికులకు అరకొర ఉపాధి

మెటీరియల్ ధరలు పెరుగుదల నిర్మాణదారులకు మోయలేనంత భారంగా మారింది. నిర్మాణం వ్యయం రెండింతలు పెరగడంతో సామాన్యులు, పెద్ద పెద్ద అపార్టుమెంట్లు, వెంచర్లను చేపట్టిన బిల్డర్లు తలలు పట్టుకుంటున్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో నిర్మాణ పనులను నిలిపివేసిన కారణంగా భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువవుతోంది. నిర్మాణ రంగంపైనే ఆధారపడిన 42 రకాల కార్మికులకు అరకొర పనులకే పరిమితం అవుతున్నారు.

ధరలను నియంత్రించి ఉపాధి కల్పించాలి

భవన నిర్మాణ రంగ సామాగ్రి ధరలను ప్రభుత్వం నియంత్రించి నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి కల్పించాలి. ప్రస్తుతం సిమెంటు, ఇనుం ధరలు కొంతమేర తగ్గినప్పటికీ నిర్మాణాలు ఏమీ ఊపొందుకోలేదు. కారణం ఇతర మెటీరియల్ ధరలు ఏమాత్రం తగ్గలేదు. ఇసుక సక్రమంగా అందుబాటులో ఉండడం లేదు. మరోవైపు నిత్యవసరాల ధరలు పెరుగుదలతో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి ఆదాయం కూడా బాగా తగ్గింది.

-రొంగల ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, భవన నిర్మాణ కార్మికుల సంఘం.

ఇసుక లేక పనులు ఉండడం లేదు

ఇసుక కొరత బాగా వేధిస్తోంది. సామాన్యులు ఇల్లు కట్టుకోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. మొదట్లో నిర్మాణాలు మొదలుపెట్టినా పెరిగిన ధరల కారణంగా అనేకమంది మధ్యలోనే పనులను నిలిపి వేశారు. దీంతో మాకు ఉపాధి కరువయ్యింది. కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఔ-కొప్పిశెట్టి లోవరాజు, తాపీ మేస్త్రి, ధర్మవరం, ప్రత్తిపాడు మండలం.

రైతులపై కాల్పులకు నిరసనగా ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం మొదలుపెట్టిన ఉద్యమంపై హర్యానా బిజెపి ప్రభుత్వం పోలీసులతో కాల్పులు జరిపించడం పట్ల రైతులు, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన ధర్నా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్, ఐఎన్‌టియుసి ఎపి అండ్ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు, సామాజిక కార్యకర్త దూసర్లపూడి రమణరాజు మాట్లాడారు. రైతాంగానికి మోడీ క్షమాపణలు చెబుతూ ఇచ్చిన హామీలు మూడేళ్ల గడుస్తున్నా అమలు చేయలేదని, కాబట్టే రైతాంగం రెండో దఫా పోరాటానికి దిగాల్సి వచ్చిందన్నారు. పదేళ్ల కాలంలో మోడీ విధానాల ఫలితంగా 1,60,000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేసి ఉంటే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. హర్యానా బిజెపి ప్రభుత్వం ఢిల్లీకి శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతాంగంపైకి పోలీసులను ప్రయోగించి అంతర్జాతీయ సమాజం నిషేధించిన పెల్లెట్స్ వంటి ఆయుధాలను, భాష్ప వాయు గోళాలను రైతులపై విసరబట్టే 200 మంది రైతులు గాయపడి, అనేక మంది చూపు కోల్పోయారని, ముగ్గురు రైతులు ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నారని, శుభ్ కరణ్ సింగ్ అనే యువరైతు ప్రాణాలు వదిలాడన్నారు. ఇవి సాధారణ మరణాలు కావని, మోడీ ప్రభుత్వ హత్యలని విమర్శించారు. మోడీ ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, రూరల్ కన్వీనర్ టి.రాజా, మేడిశెట్టి వెంకటరమణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సింహాచలం, ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తుక శ్రీను, రిటైర్డ్ పెంక్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, రాష్ట్ర కోశాధికారి సత్యన్నారాయణ రాజు, కాంగ్రెస్ యూత్ మహిళా నాయకురాలు బొజ్జా ఐశ్వర్య, సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కేశవరపు అప్పలరాజు, బ్యాంక్ ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ జిల్లా నాయకులు కె.ఆదినారాయణమూర్తి, పెదిరెడ్ల సత్యనారాయణ, సాకా రామకృష్ణ పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆదిత్ 2కె24 మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి మండలం, సూరంపాలెంలోని స్థానిక ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్లో 'ఆదిత్ 2కె24' మేనేజ్మెంట్ ఫెస్ట్ ఘనంగా ప్రారంభమయ్యిందని కళాశాల డైరెక్టర్ డాడాక్టర్ ఎన్.సుగుణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా త్రివిక్రమ్ పొట్లూరి పాల్గొన్నారు. ఆదిత్ 2కె24లో శుక్రవారం ఫైనాన్స్, మార్కెటింగ్, మానవ వనరులు (హెచ్ఆర్), బిజినెస్ ప్లాన్ యంగ్ మేనేజర్ బిజినెస్ క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. త్రివిక్రమ్ పొట్లూరి మాట్లాడుతూ విద్యార్థులు కాలానుగుణంగా తమ కార్య సాధన కోసం అధునాతన టెక్నాలజీని, 'ఆర్టిఫిషిల్ ఇంటలిజెన్స్ పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి మేనేజ్మెంట్ ఫెస్ట్‌లో ప్రత్యక్షంగా పాల్గొని వారి పరిజ్ఞానం ఇచ్చి పుచ్చుకోవడానికి ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఆదిత్ 2కె24 ఫెస్ట్‌కు దేశం నలుమూలల నుండి విద్యార్థులు వచ్చి పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు వారు ఎంచుకున్న ఈవెంట్‌లో పాల్గొని ప్రతిభ చూపి బహుమతులని గెలుపొందే అవకాశాలను ప్రతి ఒక్కరికీ కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎ.విజయ భార్గవి, మేనేజ్మెంట్ విభాగాధిపతి ఎం.గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఫెస్ట్ ప్రారంభోత్సవంలో చిన్నారుల నృత్యాలు

జర్నలిస్టులపై దాడుల పట్ల నిరసన

ప్రజాశక్తి-కాకినాడ

జర్నలిస్టులపై దాడులను ఖండించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కాకినాడ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఐఎన్‌టియు ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు, సామాజిక కార్యకర్త దూసర్లపూడి రమణరాజు మాట్లాడారు. ఇటీవల దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు పెరిగాయన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మీడియా ద్వారా ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటున్న జర్నలిస్టులపై ప్రభుత్వాలు దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించివేస్తున్నారని విమర్శించారు. ఈ నిరసనలో సిపిఎం నాయకులు సిహెచ్.అజయ్ కుమార్, కె.వీరబాబు, చైతన్య రెడ్డి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం, సిఐటియు నాయకులు సిహెచ్.రాజ్‌కుమార్, మలకా రమణ, టి.రాజా, మేడిశెట్టి వెంకటరమణ, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తుక శ్రీను, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు సిహెచ్.సత్యన్నారాయణ రాజు, కాంగ్రెస్ యూత్ మహిళా నాయకురాలు బొజ్జా ఐశ్వర్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కేశవరపు అప్పలరాజు, కాకినాడ బ్యాంక్ ఎంప్లాయిస్ లీడర్ కె.ఆదినారాయణమూర్తి, పెదిరెడ్ల సత్యనారాయణ, సాకా రామకష్ణ, పిఎస్.నారాయణ, బంగారు రాజేష్, అంజిబాబు, రాయుడు మోజెస్, నరసరాజు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

మాస్ కాపీయింగ్‌పై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-కాకినాడ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిస్టెన్స్ సెంటర్ పరిధిలో ఈ నెల 20వ తేదీ నుండి వచ్చే నెల 15వ తేదీ వరకు జరుగుతున్న 1,2,3,4 సెమిస్టర్ పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాలు మాస్ కాపీయింగ్‌కు అడ్డాగా మారిపోయాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వరహాలు, ఎం.గంగాసూరిబాబు పేర్కొన్నారు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా విద్యను అభ్యసిస్తున్న వారి కోసం ఏర్పాటు చేసిన డిస్టెన్స్ ఎడ్యుకేషన్ నేడు మాస్ క్యాంపెయిన్‌కు కేంద్రంగా మారిందన్నారు. ఒక పరీక్షకు వివిధ రకాలుగా సబ్జెక్టుకు రూ.500 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తూ మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారని, దీనిపై ఆయా విద్యాసంస్థలపై తక్షణమే యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యా హక్కు చట్టంపై దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గండేపల్లి

విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం వచ్చే విద్యా సంవత్సరం 2024-25 ఒకటవ తరగతిలో ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం కోరుకునే విద్యార్థులు ఈ నెల 23 నుండి వచ్చే నెల 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందించాలని మండల విద్యాశాఖ అధికారి కెహెచ్.నాయక్ తెలిపారు. అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ విద్యార్థులు సమీపంలోని పాఠశాలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను వారి సమీప సచివాలయంలో, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఉచితంగా చేస్తారని నాయక్ తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరగాలి

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యార్థుల్లో తరగతుల వారీగా ఆయా సబ్జెక్టుల్లో నైపుణ్యాలు పెరగకపోతే, సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని డిఇఒ రమేష్ హెచ్చరించారు. సామర్లకోట మండలం అచ్చంపేట యుపి పాఠశాలను, నవర జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ప్రతి పాఠశాలలో అకడమిక్ పరంగా ప్రతి విద్యార్థి తరగతుల వారీగా ఇంప్రూవ్‌మెంట్ లేకపోతే సంబంధిత ప్రధానోపాధ్యాయులు, టీచర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి విద్యార్థికీ చదవడం, రాయడం ఖచ్చితంగా రావాలని చెప్పారు. అచ్చంపేట యుపి పాఠశాలలో విద్యార్థులు తరగతుల వారిగా చదవడం మరియు రాయడం అభ్యసనా సామర్థ్యాలను డిఇఒ పరిశీలించారు ప్రభుత్వం ఇచ్చిన వర్క్ బుక్స్ తరగతివారీగా ఫిబ్రవరి సిలబస్‌కు అనుగుణంగా పూర్తి చేయాలన్నారు. సిలబస్ పూర్తికాక, వర్క్ బుక్కులు పూర్తి చేయకపోతే మెమోలు జారీ చేస్తామన్నారు. ప్రతి విద్యార్థి అకాడమిక్ పరంగా చదవాల్సిన విషయాలపై పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయులు శ్రద్ధ పెట్టాలని తెలిపారు. అకడమిక్ పరంగా విద్యార్థి చదవకపోయినా రాకపోయినా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులదే బాధ్యతని చెప్పారు. ప్రతి పాఠశాలా పరిశుభ్రంగా ఉండాలని ప్రతి హైస్కూల్లో ఇంటిగ్రేటెడ్ ఫ్లాట్ ప్యానెల్ ప్రతిరోజు వినియోగించేలా చూడాలని తెలిపారు. నాడు-నేడులో భాగంగా కోట్లాది రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం హెచ్చించిందని పనులు త్వరలో పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ప్రతి పాఠశాలలోనూ మినరల్ వాటర్ సదుపాయం కల్పించామని చెప్పారు. పాఠశాల ఆవరణలో తరగతి గదులు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. విద్యార్థులు యూనిఫారం, జెవికె కిట్ తప్పనిసరిగా ఉపయోగించే విధంగా చూడాలన్నారు. అనంతరం నవర హైస్కూల్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎంఇఒ పి.పుల్లయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసు, సత్యవతి ఉన్నారు.

అచ్చంపేటలో విద్యార్థుల నైపుణ్యాలు పరిశీలిస్తున్న డిఇఒ

ప్రమాదకరంగా మేడలైన్ వంతెన

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ ఇంద్రపాలెం లాకులు అంబేద్కర్ విగ్రహం జంక్షన్ వద్ద మేడలైను వంతెనను అతిప్రమాదకరంగా నిర్మించారని పౌర సంక్షేమ సంఘం విమర్శించింది. కలెక్టరేట్ నుంచి టూ వే, పాతబస్ స్టాండ్, గాంధీ నగర్, సామర్లకోట రోడ్, ఇంద్రపాలెం రెండు వంతెనల నుంచి అంబేద్కర్ జంక్షన్ 6 మార్గాల కూడలి కాగా ఏడో మార్గంగా ఇరుకు కూడలిలో మేడలైనుకు వంతెన మార్గం ఏర్పాటు చేశారన్నారు. దీని వల్ల ట్రాఫిక్ ప్రమాదాలు పెరిగిపోతాయంది. రియల్ ఎస్టేట్ మాఫియా స్వార్థంతో అడ్డగోలుగా నిర్మించారన్నారు.

కత్తిపూడిలో ప్రచారం చేస్తున్న వరుపుల సత్యప్రభ

కత్తిపూడిలో బాబు ష్యూరిటీ ప్రచారం

ప్రజాశక్తి-శంఖవరం

కత్తిపూడిలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల సత్య ప్రభ రాజా శుక్రవారం బాబు ష్యూరిటీపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మీకోసం మీ ఇంటింకి మీ సత్యప్రభ రాజా కరపత్రాలు పంచారు. టిఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు వెన్నా శివ, పార్టీ మండల అధ్యక్షుడు బద్ది రామారావు, ఉల్లి వీరభదర్రావు, పర్వత సురేష్, బచ్చల గంగ, కీర్తి సుభాష్, ఎర్రంశెట్టి బాబ్జి, కొయ్యా రమణ, సాధనల లక్ష్మీ బాబు, కంచిబోయిన శ్రీను, దేవర నాని, కేలంగి జనార్ధన్, గాబు కృష్ణమూర్తి, దేసిలంక రమణ, గాబు శివ, నక్కా శ్రీను, పిర్ల అప్పారావు, పోలం చిన్నా, మెరపల నర్సయ్య, ఈగల దేవుళ్ళు, సర్నం గోవింద్ పాల్గొన్నారు.

ఆదిత్యలో రెసిన్ ఆర్ట్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఇన్నోవేషన్ కౌన్సిల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అధ్వర్యంలో శుక్రవారం పాక్సీ ఫియాబ్రికేషన్ టెక్నిక్స్ అనే టాపిక్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ఆర్టిస్ట్, ఎంటర్‌ప్రెన్యూర్ దివ్యలలిత విద్యార్థులకు రెసిన్ ఆర్ట్ ద్వారా క్రాఫ్ట్‌లను తయారు చేయడంలో శిక్షణ ఇప్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, జెడి వెంకటేష్, కో ఆర్డినేటర్లు డాక్టర్ పిఎస్.రంజిత్, డాక్టర్ విశాలాక్షి, పి.సంతోషి ప్రవల్లిక, వి.సునీత పాల్గొన్నారు.

జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులు

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడలో నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి విశేష స్పందన లభించింది. కాకినాడకు చెందిన వ్యాపారవేత్త సానా సతీష్ బాబు తన సానా సతీష్ బాబు ఫౌండేషన్ ద్వారా గత కొన్నేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, దీంతో పాటు కాకినాడ జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కాకినాడ కేంద్రంగా జాబ్ మేళాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సానా సతీష్ బాబు బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్ వేర్ సంస్థ ప్రోక్సోలేరా ప్రతినిధులను సంప్రదించి కాకినాడ జిల్లా యువతకు ఉద్యోగాఅవకాశాలు కల్పించేందుకు ముందుకు రావాలని కోరగా సంస్థ ప్రతినిధులు కాకినాడలో రెండు రోజుల పాటు జాబ్‌మేళా నిర్వహించేందుకు అంగీకరించారు. దీంతో ఫౌండేషన్ ప్రతినిధులు ముందస్తుగా కాకినాడ జిల్లావ్యాప్తంగా గత కొన్ని రోజులుగా యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అర్హులైనవారి వివరాలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించారు. జాబ్ మేళా తొలి రోజు శుక్రవారం సుమారు 280 మంది రాత పరీక్షకు హాజరవ్వగా, అందులో ప్రతిభ కనబరిచిన 25 మందిని ఎంపిక చేసి వారికి టెక్నికల్ టెస్ట్‌లు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. రెండో రోజు మరో 300 మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి కూడా రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి అదేరోజు అందరికీ కన్ఫర్మేషన్ లెటర్స్ అందిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సానా సతీష్ బాబు చేస్తున్న కృషి మరువలేనిదని ఈ సందర్భంగా నిరుద్యోగ యువత కృతజ్ఞతలు తెలిపారు. జాబ్ మేళాకు హాజరైన యువతకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఫౌండేషన్ ప్రతినిధులు విస్తత ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోక్సోలేరా సంస్థ సిఇఒ మోహన్ రాఘవేంద్ర, వైస్ ప్రెసిడెంట్ కె.గురుప్రసాద్, డైరెక్టర్ శ్రీనివాసరావు, సానా సతీష్ బాబు ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య సేవలందిస్తునన డాక్టర్ సత్యనారాయణ

శారీరక వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రోజూ శారీరక వ్యాయామం చేస్తూ సొంతంగా పనులు చేస్తుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించి ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. శారీరక శ్రమ వల్ల ఎముకలు గట్టి పడటంతో పాటు చివరి దశ వరకు ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఎముకలు బలహీన పడితే చిన్నపాటి ప్రమాదాలకే విరుగుతాయన్నారు. పోషకాహార లోపం, దీర్ఘకాలిక మందుల వినియోగం ఎముకలపై ప్రభావం చూపుతుందన్నారు. ఎముకల బలానికి గాను తగినంత ఖనిజాలు, ప్రోటీన్లు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్ అడ్డాల తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఎన్నికల్లోపు... ఎప్పుడు ఏ పార్టీ కండువా అవసరం అవుతుందోని.. అన్నీ ఉతికారేసి బీరువాలో పెట్టానయ్యాగారూ..!!

శంకుస్థాపన చేస్తున్న సూరిబాబు తదితరులు

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -కరప

సిసి రోడ్డు నిర్మాణానికి అన్నవరం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ చాగంటి సూరిబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపిడిఒ కార్యాలయం పక్క నుంచి పారిశుధ్య కార్మికుల కుటుంబ నివాస ప్రాంతాలు, రైతులు పొలాలకు వెళ్లే పుంతరోడ్డును కలుపుతూ రూ.10 లక్షల నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ నిధులు మంజూరు చేసిన మాజీ మంత్రి కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబుకు పారిశుధ్య కార్మికులు, రైతులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చాగంటి వెంకట్రావు, నక్కా వీరభద్రరావు, గొర్రెల వెంకన్న, కాకినాడ ఈశ్వరరావు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ సాదే విజయలక్ష్మి వీరరాఘవులు, తుమ్మలపల్లి తాతాజీ, మేడిశెట్టి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం చిక్కాల పాలెంలో సారాను విక్రయిస్తున్న వీరవెల్లి మునీశ్వరునిని అరెస్టు చేసి అతని నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకన్నామని ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు, జూదాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. సారా తయారు చేయడం లేదా విక్రయించడం లేదా రవాణా చేయడం నేరమన్నారు. అనుమతి లేని బెల్టు షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం అచ్చన్నపాలెం ఎస్‌సి కాలనీ వద్ద శ్రీలక్ష్మీ మల్టీప్లెక్స్ థియేటర్ ఎదురుగా 16వ నెంబరు జాతీయ రహదారిపై లారీ ఢీకొని మహిళ మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక కాలనీకి చెందిన గోగులమూడి అచ్చియమ్మ(60) స్థానిక శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ థియేటర్లో స్వీపర్‌గా పనిచేస్తుంది. చెత్త పారబోసేందుకు వెళ్లిన వెళ్తుండగా ఆమెను లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి రాయుడు సునీత

రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామీణ రహదారులను మండల పరిషత్ నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ అన్నారు. ఇంజరం పంచాయతీ పరిధిలోని పెదగోవలంక వెళ్లే రహదారి అభివృద్ధి పనులుక ఎంపిపి సునీత శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో ఈ రహదారిని నిర్మించను న్నామని, వీటితో పాటు గ్రామంలో మరికొన్ని రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, నాయకులు రాయుడు గంగాధర్, ఎంపిటిసి కోరుకొండ కిరణ్ కుమారి, ఉపసర్పంచ్ కోరుకొండ అప్పారావు, గోవలంక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ, ఎంపిటిసి మోర్త బీమాబాయి, కూరాటి వాసు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సుంకర పావని

సూపర్ సిక్స్ పథకాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ

టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ సూపర్ సిక్స్ పథకాలను టిడిపి మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తిరుమల కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టర్లు విడుదల చేశారు. పోస్టర్లు, హోర్డింగ్స్, పలు ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం ప్రారభించారు. ఈ సందర్భంగా సుంకర పావని మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పేద బడుగు బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో గొప్ప మార్పు వస్తుందన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న యూనియన్ నాయకులు

సమస్యలపై ఆరోగ్య కార్యదర్శుల వినతి

ప్రజాశక్తి-కాకినాడ

జిఎన్ఎం శిక్షణ పొందుతున్న సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు తమ సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, స్టేట్ నర్సింగ్ డిడిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ సచివాలయం కార్యదర్శుల సంఘం నాయకులు నీరజ, నాగవరలక్ష్మి మాట్లాడారు. సుమారు 115 మంది జిఎన్ఎం శిక్షణ పొందిన వారు పరీక్షలు సక్రమంగా రాసినప్పటికీ ఫెయిల్ అయ్యామని చెప్పారు. సరైన రీతిలో రీవాల్యుయేషన్ జరిపించి శిక్షణ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. పరీక్షలకు ముందు రెండు వారాలపాటు ప్రిపరేషన్ హాలిడేస్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

ప్రత్యర్థి ఎవరైనా విజయం నాదే

ప్రజాశక్తి -సామర్లకోట

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్యర్థి ఎవరైనా వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన గెలుపు ఖాయమని దవులూరి దొరబాబు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో దొరబాబు శుక్రవారం మాట్లాడుతూ ఎంఎల్ఎ చినరాజప్ప ఆరోగ్యం సరిగా లేదని అదే పార్టీకి చెందిన నాయకులు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారని అన్నారు. తన ప్రత్యర్థిగా ఎవరు నిలబడినా తాను గెలవడానికి సిద్ధంగా ఉన్నానని దవులూరి దొరబాబు ప్రకటించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నమ్మకానికి ప్రతీక అన్నారు. తొలుత స్థానికుడైన తనకు రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ పదవిని అందించారని తెలిపారు.

గ్రూప్-2 పరీక్షలకు పటిష్టమైన చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 25న గ్రూప్-2 పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను పటిష్టంగా చేపట్టాలని డిఆర్ఒ డి.తిప్పేనాయక్ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లను కోరారు. ఈ మేరకు ఆయన, ఎపిపిఎస్‌సి అధికారులతో కలిసి శుక్రవారం కలెక్టరేట్‌లోని విధాన గౌతమి సమావేశపు హాల్లో వారికి ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని, వీటిని 14 రూట్లుగా ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 24,489 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్షా కేంద్రాల్లో వీరికి అవసరమైన అన్ని సదుపాయాలూ కల్పించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆయన కోరారు. అంతరాయం లేని విద్యుత్ సరఫరా, తాగునీరు, పరీక్షా

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ తిప్పే నాయక్

కేంద్రాల వద్ద భద్రత, సెల్ ఫోన్ల నిషేధంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఒఎంఆర్ షీట్లు, క్వశ్చన్ బుక్‌లెట్‌లకు సంబందించిన అంశాలను ఎపిపిఎస్ అధికారులు వివరించారు.

వైసిపి సేవాదళ్ కార్యకర్తలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - జగ్గంపేట

వైసిపి మళ్లీ గెలిచాక సేవాదళ్ విభాగం సభ్యులకు అధిక ప్రాధాన్యత ఇస్తామని మాజీ మంత్రి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పార్టీ సేవాదళ్ విభాగం కార్యకర్తల సమావేశం జెసిఎస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో నరసింహం ప్రసంగించారు. మరో 50 రోజుల్లో సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి గెలిచి, జగనన్న మరొకసారి ముఖ్యమంత్రి కావడంలో సేవాదళ్ విభాగం కీలకం కావాలని ఆయన అన్నారు. సేవాదళ్ విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ సిహెచ్.వెంకట్రాయుడు మాట్లాడుతూ జిల్లాలో జగ్గంపేట నియోజకవర్గంలోనే తొలి సమావేశం నిర్వహించినట్టు చెప్పారు. అత్తులూరి సాయిబాబు మాట్లాడుతూ జగ్గంపేటలోనే పార్టీ ఆవిర్భావం జరిగిందని, పార్టీ గెలుపుకు అందరూ కృషి చేసి హ్యాట్రిక్ విజయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత

నరసింహం, రఘురామ్‌ను సత్కరిస్తున్న నాయకులు

తోట రామ్‌జీ, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు వెంకట రమణ, కీలపర్తి వీరబాబు, సుంకవల్లి శ్రీనివాసు, నరాలశెట్టి నరసయ్య, కర్రి నారాయణమూర్తి, గొల్లపల్లి శ్రీను, ఎంపిపి చలగళ్ల దొరబాబు, మద్దిపట్ల రామకృష్ణ, రామకుర్తి మూర్తి, పాము సూరిబాబు, తాళ్లూరు మధుకుమార్, ఆకుల శ్రీధర్, కాపవరపు ప్రసాద్, పాల్గొన్నారు.

చొల్లంగి భూములు స్థానికులకే కేటాయించాలి

ప్రజాశక్తి-తాళ్లరేవు

చొల్లంగి భూములను స్థానిక దళితులకే కేటాయించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జక్కల ప్రసాద్ బాబు డిమాండ్ చేశారు. చొల్లంగి పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 47/3 లోని 4.24 ఎకరాల సాల్టు భూముల్లో స్థానికులకే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని గ్రామస్తులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారం 24 రోజులకు చేరాయి. దీక్షలు చేస్తున్న వారికి దళిత సంఘాలు మద్దతుగా నిలుస్తాయని జక్కల ప్రసాద్ బాబు అన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన భూముల్లో కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన ఉప్పలంక లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వడం తగదన్నారు. కాకినాడ వాసులకు చొల్లంగిలో పట్టాలు ఏ విధంగా ఇస్తారని ప్రశ్నించారు. చొల్లంగిలో ఉన్న అర్హులైన స్థానిక దళితులకు చొల్లంగి భూములు కేటాయించాలని కోరారు. లేనియెడల తగిన గుణపాఠం

దీక్షల్లో పాల్గొన్న స్థానికులు, నాయకులు

చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, దేవానందం, మురళి, మోర్త భైరవమూర్తి, సుబ్రహ్మణ్యం, టిడిపి మండల అధ్యక్షుడు కట్ట త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ సంసిద్ధం

ప్రజాశక్తి - సామర్లకోట

రానున్న ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలుగుదేశం పార్టీ క్షేత్రస్థాయిలో సంసిద్ధంగా ఉందని టిడిపి కాకినాడ పార్లమెంట్ జోనల్ కో ఆర్డినేటర్ రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు అన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు జిల్లాల స్థాయిలోనే కాక పార్లమెంటరీ స్థాయిలో కూడా అధ్యక్షులను నియమించినట్లు రంగారావు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం సామర్లకోట మండలం అచ్చంపేటలో తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి రాబోయే ఎన్నికల్లో అఖండ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాకినాడ పార్లమెంటరీ స్థాయిలో ఒక కాకినాడ పార్లమెంటు స్థానంతో పాటు దాని పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ విజయదుందుభి మోగిస్తుందని తెలిపారు. పూర్తిస్థాయిలో పార్టీని పటిష్టం చేయనున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో టిడిపి, జనసేన పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పని చేయడానికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ పెద్దాపురంలో టిడిపి విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వార్డు వార్డున, గ్రామ గ్రామాన పార్టీ కార్యకర్తలను సమీకరించి పూర్తిస్థాయిలో అసెంబ్లీ ఎన్నికలకు ముందుకెళుతున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నిమ్మకాయల రంగనాగ్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నా క్యారేజ్ వేడుకలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ద్వారా ఏర్పరచిన అన్నా జనార్ధన్ క్యారేజ్ పేదలకు భోజన వితరణ కార్యక్రమం 650 రోజులు పూర్తయిన సందర్భంగా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ముఖ్యఅతిథిగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. 650 రోజులను సూచిస్తూ ప్రత్యేక కేకు కట్ చేసి పంపిణీ చేశారు. కింజరాపు యర్రంనాయుడు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెరుకూరి సాయిరాం వర్మ ఆధ్వర్యంలో పేదలకు భారీ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సుబ్బు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పేరిట నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విమర్శలు సహేతుకంగా

భోజనాలు పంపిణీ చేస్తున్న సాయిరామ్ వర్మ

ఉండాలే తప్ప వ్యక్తిగతంగా ఉండరాదన్నారు. రాజకీయ విమర్శలలో కుటుంబ సభ్యులను లాగడం బాధాకరమన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. అడపా జగదీష్, మండపాక నాగబాబు, కర్రి వీరబాబు పాల్గొన్నారు.

విద్య, వైద్యంతో దేశాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

దేశ ప్రజలకు విద్య, వైద్యం సక్రమంగా అందితేనే దేశాభివృద్ధి సాధ్యమని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్‌వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కమ్యూనిటీ హాల్లో గ్రామ సంఘాల సహాయకులు, ఆశా వర్కర్ల ఆత్మీయ సమావేశానికి మంత్రి వేణు గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా పని చేసినప్పుడు అందరికీ సమ న్యాయం జరుగుతుందన్నారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే స్త్రీ విద్య కోసం ఎనలేని కృషి చేశారన్నారు. ఆ సత్ఫలితాలు నేడు కనపడు తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యదిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ప్రాథమిక విద్య నుంచే ఇంగ్లీష్ మీడియం, ఆరోగ్యానికి సంబంధించి జగనన్న గోరుముద్ద, పాఠశాల ఆధునికీకరణ, జగనన్న విద్యా కానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివి అమలు చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో మెడికల్ కళాశాలలు 11 మాత్రమే ఉండేవని, నూతనంగా మరో 17 వైద్య బోధన కళాశాలలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. మరోవైపు ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. చందన నాగేశ్వర్, గిరజాల బాబు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సీతారామారావు

ఎన్నికలు సమర్థంగా నిర్వహించేందుకు శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో శుక్రవారం సెక్టోరియల్, పోలీస్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై రెండు రోజులపాటు జరిగే శిక్షణ తరగతుల ప్రారంభ సభలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అధికారి, సిబ్బంది పూర్తిస్థాయిలో ఎన్నికల నిర్వహణపై నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి టీమ్ తమ రోజువారీ రిపోర్టును, వీడియోలను రిజిస్టర్‌లో పొందుపరిచి సాయంత్రానికి తమ టీమ్ లీడర్‌కు అందజేయాలన్నారు. పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 200 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. 22 మంది సెక్టోరియల్, 22 మంది పోలీసులు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్నారన్నారు. అనంతరం ఇవిఎం, వివి.పాట్స్, ఏజెంట్లు, మాక్ పోల్ తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి లతా కుమారి, డిఎల్‌పిఒ బాలామణి, సిఐ రవికుమార్, ఎస్సై వి.సురేష్, మున్సిపల్ డిఇ ఆదినారాయణ రావు పాల్గొన్నారు.

యానాం వార్తలు

బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ యువజన అధికారి

నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-యానాం

యానాం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, కోకో, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణ సుధాకర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి తిర్రి గోపి పాల్గొన్నారు.

25న జిప్‌మర్ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-యానాం

నియోజకవర్గంలో రూ.48.85 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన జిప్మర్ ఆసుపత్రి కన్సల్టెన్సీ యూనిట్‌ను ప్రధాని మోడీ ఈ నెల 25న గుజరాత్ నుంచి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించనున్నారు. స్థానిక ప్రభుత్వ అసుపత్రి సమీపంలో రూ.కోట్ల కేంద్ర నిధులతో నిర్మించిన జిప్మర్ యూనిట్ ప్రారంభం నేపథ్యంలో ఆర్ఎఒ మునిస్వామి, పుదుచ్చేరి జిప్మెర్ డైరెక్టర్ రాకేష్ అగర్వాల్, డిప్యూటీ డైరెక్టర్ కృష్ణ గోపాల్ గోయల్ ఇప్పటికే ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రమాదకరంగా కల్వర్టు..

కరప : కరప గ్రామంలో సీతమ్మ పేట, పల్లపు వీధి, నక్కా వారి పేట, మత్స్యకార కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారి నాసిరకంగా నిర్మించిన కల్వర్టుపై దిమ్మలు కూలిపోవడంతో ఆ ప్రాంతాలకు వెళ్లే స్కూల్ ఆటోలు, స్కూల్ బస్సులు, ప్రయాణికుల వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారుల అవినీతికి అడ్డగా ఈ నాసిరకంగా వేసిన డ్రైనేజీ కల్వర్టు నిదర్శనంగా నిలుస్తుందని స్థానికులు గుప్పిస్తున్నారు. పెద్ద వాహనాలు, స్కూల్ బస్సులు, నిత్యం రద్దీగా వెళ్లే ఈ రహదారికి ఐరన్ మెస్‌తో కల్వర్టు నిర్మించాల్సి ఉన్నప్పటికీ అధికారులు మామూళ్లు తీసుకుని కాంట్రాక్టర్‌కు

కల్వర్టుపై కూలిపోయిన సిమెంట్ దిమ్మలు

అనుకూలంగా పని చేసారని దీంతో ఈ సమస్య ఉత్పన్నం అవుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి దఢమైన కల్వర్టు నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అనంతలక్ష్మి దంపతులు

రూరల్ సీటు ఎవరికిచ్చినా కలిసి పని చేస్తాం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ అసెంబ్లీ సీటు టిడిపి-జనసేన పొత్తులో భాగంగా ఎవరికి కేటాయించినా కలిసి పని చేస్తామని, అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ మూర్తి దంపతులు తెలిపారు. శుక్రవారం రూరల్‌లోని వలసపాకల గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడారు. కాకినాడ రూరల్ సీటు శెట్టిబలిజ సామాజికవర్గానికి కేటాయిస్తూ వస్తున్నారని అయితే ఈసారి పొత్తులో భాగంగా మారే అవకాశాలు ఉన్నాయని తెలియడంతో కొందరు తమ పార్టీకి చెందిన నేతలు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. తాజాగా తమ పార్టీకి చెందిన నాయకులు తమ కుటుంబానికి టికెట్ కేటాయించాలని లేనిపక్షంలో ఇతర పార్టీలకు కేటాయిస్తే వారికి పని చేయనని చెప్పడం కేవలం తన మీద ఉన్న అభిమానమేనన్నారు. వైసిపికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పూర్తిస్థాయి క్షేత్రస్థాయి ప్రచారంలో ప్రత్యక్షంగా ఉంటామని చెప్పారు. తమ కుటుంబం తెలుగుదేశం పార్టీని వదిలేది లేదని పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ మూర్తిల స్పష్టం చేశారు.

వాలంటీర్ల సేవలు వెల కట్టలేనివి

ప్రజాశక్తి - సామర్లకోట

సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను, వైసిపి మ్యానిఫెస్టోను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వాలంటీర్ల సేవలకు వెల కట్టలేమని పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వం ఉత్తమ సేవలు కనబరుస్తున్న వాలంటీర్లకు పురస్కారాలు అందించే 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమం ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దవులూరి దొరబాబు పాల్గొని మాట్లాడారు. 4 సంవత్సరాల 9 నెలల జగనన్న పాలనలో పేదలకు పెన్షన్లు నుండి అందరికీ ఇళ్ల పట్టాల వరకూ ఎన్నో అమూల్యమైన సేవలు అందించిన ఘనత వాలంటీర్లకే దక్కుతుందన్నారు. పార్టీల తారతమ్యం లేకుండా అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించిన ఘనత సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. మండల పరిధిలో 18 గ్రామాలకు సంబంధించి 482 మంది వాలంటీర్లకు అవార్డులు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దవులూరి సుబ్బారావు, జెడ్‌పిటిసి ఎలిశెట్టి అమృత నరేష్, నియోజవర్గ నాయకులు తలారి దొరబాబు, తాటికొండ అచ్చిరాజు, ఎలిసెట్టి నరేష్, మోరంపూడి రమేష్, వీరంరెడ్డి ఆనంద్ గుప్తా, ఎంపిడిఒ శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సహకరించాలి : సిఐ

ప్రజాశక్తి- కడియం

గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీ నాయకులు పోలీసులకు సహకరించాలని కడియం సిఐ బి.తులసీధర్, ఎస్ఐ కృష్ణసాయి కోరారు. కడియం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజలు ప్రతి చిన్న విషయానికి గొడవలకు పోరాదన్నారు. చిన్నచిన్న సమస్యలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా ఇప్పటి నుంచే గ్రామాల్లో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పోయి కేసుల్లో చిక్కుకోరాదన్నారు. ప్రతి గ్రామంలోనూ శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కడియం మండలంలో గతంలో నేరాలు అధికంగా నమోదు అయ్యాయని, ప్రస్తుతం నేరాల సంఖ్య బాగా తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని, నాయకులు లావేటి రమేష్, సర్కార్ బాషా పాల్గొన్నారు.

కష్టపడి పని చేసేవారికి గుర్తింపు : తోట

ప్రజాశక్తి -గోకవరం

కష్టపడి పని చేసేవారందరికీ గుర్తింపు ఉంటుందని వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం అన్నారు. శుక్రవారం గోకవరం ఎంపిడిఒ కార్యాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వాలంటీర్లకు సేవావజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. వాలంటరీర్ల సేవలు ఎనలేనివన్నారు. రాబోయే రోజుల్లో వాలంటీర్లకు మరింత ఆర్థిక అభివృద్ధి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట రాంజీ, వైసిపి మండల నాయకుల, కార్యకర్తలు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపిడిఒ, పాల్గొన్నారు.

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో
O.S. 68/2017
Between:
వాది: యేలేటి వీర వెంకట సత్తిబాబు
ప్రతివాదులు: గల్ల కోటేశ్వరరావు (died) వగైరా
D-4: ఆత్మూరి కాసులమ్మ
W/o. సాయిబాబు, 55 సం॥లు,
గృహిణి, రాజుగారి సందు, పెద్దాపురం.
ప్రకటన
పై నెంబరు దావాలో 4వ ప్రతివాది అయిన ఆత్మూరి కాసులమ్మ, W/o. సాయిబాబు, రాజుగారి సందు, పెద్దాపురంనకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను గ్రామంలో లేనట్లుగా తిరిగి వచ్చుచున్నందున ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా, **దిి. 27-2-2024వ సం॥రం తేదీని మీరు ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీయొక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల సదరు దావా నుండి మిమ్ములను ఎక్స్‌పార్టీ చేసి మీ మీద ఎక్స్‌పార్టీ డిక్రీ పొందగలరని తెలియజేయడమైనది.
కె.వి.రాయుడు
వాది తరపు అడ్వకేటు, పెద్దాపురం

IN THE HONOURABLE COURT OF THE M.A.C.T.-CUM-IVth ADDITIONAL DISTRICT JUDGE FOR SC AND ST COURT AT VIZIANAGARAM
M.O.P. 419/2023
Between:
Mallajyosula Padmaja ...Petitioner
And: **Routhu Gurumurty and Others** ...Respondents
To, **1 Respondent:**
Routhu Gurumurty S/o Laxmanareddy, aged about 44 years, driver of bus AP.02 TE 0174,r/o D.No. 186, Main road, Isukaptla, Pangidi village, Kovvuru mandal, West Godavari District.
Please take notice that the above named petitioner filed the above M.V.O.P 419/2022 against you and others for claiming compensation on account of injuries sustained by her in a motor vehicle accident and the matter coming for your appearance and stands posted to **29-02-2024,** on that day your personally or through your Advocate attend before the **Honorable Court at 10-30 A.M.,** failing which the Honorable Court will be heard and determined in your absence exparte as per Law.
V.SAMBA.MURTHY
ADVOCATE,
VIZIANAGARAM, CELL: 9177559153.

ప్రకటన
మహారాజశ్రీ తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
OS No. : 590 / 2023
మధ్య :
కొలుకులూరి కేధారి, తండ్రి : కోటేశ్వరరావు, హిందువు, వయస్సు 40 సం.లు, వ్యాపారం, డోర్ నం.12-40, వెంకటగిరి-2, పిడింగొయ్యి, రాజమహేంద్రవరం రూరల్, తూర్పు గోదావరి జిల్లా. ...వాది
మరియు
కావ సత్యనారాయణ తండ్రి : నాగేశ్వరరావు, హిందువు, వయస్సు 40 సం.లు, C/o. త్రిబతి శ్యామ్ సుందర్, డోర్ నం.2-28 -116, శాంతి నగర్, 3వ వీధి, ఓల్డ్ లిటిల్ ప్యారడైజ్ స్కూలు వెనుక, నిడదవోలు, పశ్చిమ గోదావరి జిల్లా. ... ప్రతివాది
పై దావా గ్రంథములో వాది, ప్రతివాదికి ఎన్నిమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినను, ప్రతివాది ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున, శ్రీ కోర్టు వారు ఈ పత్రిక ప్రకటన ద్వారా ప్రతివాదికి తెలియచేయునది దివి.28-02-2024వ తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం.10-30 ని.లకు ప్రతివాది వ్యక్తిగతంగా గాని, ప్లీడరు సమక్షంలో గాని హాజరు అయి ఏమైనా అభ్యంతరాలు ఉంటేగాని, వాదనలు గాని తెలుకోవలెను లేనిచో శ్రీ కోర్టువారు, ప్రతివాది పరోక్షంలో దావా తీర్మానించెదరని తెలియచేయుచున్నాము.
ఇట్లు
జి. మోహన వంశీ, న్యాయవాది
పాండురంగ నగర్, దానవాయిపేట,
రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా.
రాజమండ్రి, 22-02-2024. సెల్: 94414 85759